ఎకరాకు 30లక్షలు చెల్లించండి!

- ట్రిపుల్ఆర్‌పై ఎన్‌హెచ్ఏఐకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ
- గతంలో ఎన్టీపీసీ చెల్లించిన విషయం ఆ సంస్థ దృష్టికి
- సాధ్యమైనంత ఎక్కువ పరిహారం చెల్లించేందుకు యత్నం

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): ట్రిపుల్ఆర్ భూ నిర్వాసితులకు ఎకరానికి రూ.30 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కి లేఖ రాసినట్టు తెలిసింది. రాష్ట్రంలో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వరంగ సంస్థ ఎన్టీపీసీ గతంలో ఎకరాకు రూ.30 లక్షల చొప్పున చెల్లించిందని ఆ లేఖలో గుర్తుచేసినట్టు తెలుస్తున్నది. అదేవిధంగా ట్రిపుల్ఆర్ నిర్వాసితులకు కూడా చెల్లించాలని పేర్కొన్నట్టు సమాచారం. ట్రిపుల్ఆర్‌కు భూములు ఇచ్చేందుకు రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరగకూడదనే ఉద్దేశంతో నిర్వాసితులకు సాధ్యమైనంత ఎక్కువ నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ క్రమంలోనే ట్రిపుల్ఆర్ భూసేకరణ పురోగతిపై ఇటీవల ముఖ్యమంత్రి సమక్షంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గతంలో ఎన్టీపీసీ ఎకరాకు గరిష్ఠంగా రూ.30 లక్షల చొప్పున చెల్లించిన విషయాన్ని ప్రభుత్వానికి అధికారులు తెలిపారు. ఎన్టీపీసీ కూడా కేంద్ర ప్రభుత్వ సంస్థే కావడంతో అదే తరహాలో ట్రిపుల్ఆర్‌కూ నష్టపరిహారం చెల్లించాలని ఎన్‌హెచ్ఏఐని రాష్ట్ర ప్రభుత్వం కోరినట్టు తెలిసింది.

బహిరంగ మార్కెట్‌లో రూ.50 లక్షలకు పైనే

ట్రిపుల్ఆర్ భూసేకరణ సమస్యల పరిష్కారానికి గాను కలెక్టర్ల నేతృత్వంలో ఆర్బిట్రేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. స్థానికంగా భూముల ధరలు ఎంత? సంవత్సరానికి ఎన్ని పంటలు పండుతాయి? ఆ భూములు పట్టణానికి దగ్గరగా ఉన్నాయా? భవిష్యత్తులో వాటి విలువ ఏ మేరకు పెరిగే వీలుంది?.. తదితర అంశాల ఆధారంగా భూముల ధరలను ఆర్బిట్రేషన్ నిర్ధారిస్తుంది. ఆ ధరలను ఎన్‌హెచ్ఏఐ చెల్లించాల్సి ఉంటుంది. భూసేకరణ చట్టం ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో మార్కెట్ ధరకు కనీసం రెండు రెట్లు, పట్టణ ప్రాంతాల్లో నాలుగు రెట్లు అధికంగా నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఎకరా సుమారు రూ.2 లక్షలు ఉండగా, రూ.6 లక్షల చొప్పున చెల్లించాలని నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ.50 లక్షలకు పైనే పలుకుతుండటంతో మార్కెట్ ధర చెల్లిస్తే భూసేకరణ సాధ్యంకాదని ప్రభుత్వం నిర్ణయానికొచ్చింది. అందుకే వీలైనంత ఎక్కువ నష్టపరిహారం చెల్లించాలని భావిస్తున్నది.

మానవీయ కోణంలో ఆలోచించండి

నష్టపరిహారం చెల్లింపులో మానవీయ కోణంలో ఆలోచించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను సీఎం కోరారు. ఈ క్రమంలోనే ఎన్టీపీసీ మాదిరిగా ఎకరాకు రూ.30 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కేంద్రాన్ని కోరినట్టు అత్యంత విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ట్రిపుల్ఆర్ ఉత్తర భాగం నిర్మాణం కోసం భూసేకరణ కొనసాగుతున్నది. మొత్తం 4,682 ఎకరాలకు గాను 3,261 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసినప్పటికీ ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించలేదు. సుమారు 200 ఎకరాలు అటవీభూమి ఉండగా.. మిగిలిన భూముల విషయంలో రైతుల నుంచి వ్యతిరేకత, కోర్టు కేసులు అడ్డంకిగా మారాయి.

ట్రిపుల్ఆర్ భూసేకరణ పురోగతి వివరాలు...

ఉత్తర భాగం కోసం సేకరించాల్సిన భూమి
4,682 ఎకరాలు

ప్రజాభిప్రాయ నోటిఫికేషన్ జారీచేసినవి
4,600 ఎకరాలు

అవార్డ్ పాస్ చేసినవి
3,261 ఎకరాలు
(ఇంకా చెల్లింపులు జరపాల్సి ఉంది)

ఆర్బిట్రేషన్ వద్ద విచారణలో ఉన్నవి
1,107 ఎకరాలు

కోర్టు కేసుల్లో ఉన్నవి
232 ఎకరాలు

చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ట్రిపుల్ ఆర్ బాధితులు

ట్రిపుల్ఆర్ నిర్వాసితుల ఆందోళన

చౌటుప్పల్, జనవరి 9 : రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న చౌటుప్పల్, వలిగొం గ్రామాల్లోని నిర్వాసితులు గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆందోళనను అడ్డుకునేందుకు పోలీసులు పెద్దఎత్తున మోహరించినా రైతులు లెక్కచేయలేదు. అనంతరం 65వ జాతీయ రహదారిపైన రాస్తారోకో చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా 'మా భూములు మాకే కావాలి ..కన్న తల్లి ముద్దురా ట్రిపుల్ ఆర్ వద్దురా.. ప్రాణం పోయినా సరే భూములు ఇవ్వం' అంటూ రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అలైన్‌మెంట్ మార్చే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు.

ట్రిపుల్ఆర్ దక్షిణభాగం డీపీఆర్‌కు రీటెండర్

హైదరాబాద్, జనవరి 9(నమస్తే తెలంగాణ) : ట్రిపుల్ఆర్ దక్షిణ భాగం సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్) తయారీకి కన్సల్టెంట్ నియామకం కోసం రోడ్లు భవనాల శాఖ టెండర్లు ఆహ్వానించింది. డీపీఆర్ తయారీ కోసం గత నవంబర్ 25న గ్లోబల్ టెండర్లు పిలిచినా కన్సల్టెంట్ సంస్థలు ముందుకు రాలేదు. దీంతో తాజాగా గురువారం రీటెండర్ ఆహ్వానించినట్టు అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 9వరకు టెండర్లకు గడువు ఇచ్చారు. నాలుగు లేన్ల ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలని నిర్ణయించారు. ట్రిపుల్ఆర్ ఉత్తర భాగం పనులకు ఇప్పటికే జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) టెండర్లు ఆహ్వానించిన విషయం తెలిసిందే. దక్షిణ భాగం పనులను రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టాలని ముందు భావించినప్పటికీ.. ఇటీవల ఆ పనులను సైతం ఎన్‌హెచ్ఏఐ ద్వారానే నిర్వహించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో డీపీఆర్ తయారుచేసి కేంద్రానికి సమర్పించాల్సి ఉంది. వాస్తవానికి ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగానికి గతంలో రూపొందించిన అలైన్‌మెంట్‌లో మార్పులు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా డీపీఆర్ తయారీకి టెండర్లు ఆహ్వానించారు. దక్షిణ భాగం చౌటుప్పల్, షాద్‌నగర్ మీదుగా సంగారెడ్డి వరకు సుమారు 182.23 కిలోమీటర్లు ఉంటుంది.

దుద్దెడ గురుకుల పాఠశాలలో విద్యార్థి గాయాన్ని చూస్తున్న జడ్జి స్వాతిరెడ్డి

గురుకుల విద్యార్థులను చితకబాదిన పీడీ

- స్టడీ అవర్‌కు ఆలస్యంగా వచ్చారంటూ 30 మంది విద్యార్థులకు వాతలు
- సిద్దిపేట జిల్లా దుద్దెడ గురుకులంలో ఘటన

గజ్వేల్, జనవరి 9: విద్యార్థులు తెల్లవారుజామున స్టడీ అవర్‌కు ఆలస్యంగా వచ్చినందుకు వారిపై పీడీ(ఫిజికల్ డైరెక్టర్) తన ప్రతాపాన్ని చూపించాడు. 30 మంది విద్యార్థులకు వరుస క్రమంలో నిలబెట్టి కర్రతో చితకబాదాడు. ముగ్గురు విద్యార్థులకు తీవ్రంగా గాయాలవడంతో సిద్దిపేటలోని దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. వివరాలు.. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ప్రతిరోజు విద్యార్థులను వాచ్‌మన్ ఉదయం 5 గంటలకు నిద్రలేపాల్సి ఉండగా ఆలస్యంగా 5.40 గంటలకు లేపడంతో చలి తీవ్రంగా ఉండడం కారణంగా స్టడీ అవర్‌కు పది నిమిషాలు ఆలస్యంగా వెళ్లారు. ఎందుకు ఆలస్యం అయిందంటూ విద్యార్థులపై పీడీ వాసు ఆగ్రహం వ్యక్తం చేసి కర్రతో బాదాడు. దీంతో పలువురికి వాతలు తేలాయి.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మరి కొందరు విద్యార్థుల కాళ్లు, చేతులకు గాయాలవడంతో ఇబ్బంది పడ్డారు. విద్యార్థులను సిద్దిపేటలోని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. పాఠశాలకు వచ్చిన తరువాత విద్యార్థులకు కూర్చోవడం ఇబ్బందికరంగా ఉండడంతో వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని వారి పిల్లల శరీరంపై ఉన్న గాయాలను చూసి చలించిపోయారు. గతంలో కూడా పీడీ వాసు విద్యార్థులను ఇలాగే చితకబాదితే తల్లిదండ్రులు గురుకులాల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, జడ్జి స్వాతిరెడ్డి గురువారం పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు.

నిర్బంధంలో గురుకులాలు

- విద్యార్థులను చితకబాదిన పీడీని సస్పెండ్ చేయాలి
- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

దుద్దెడ గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), జనవరి 9 : కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకుల పాఠశాలలు నిర్బంధంలో కొనసాగుతున్నాయని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని దుద్దెడ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండపాక గురుకుల పాఠశాల పీడీ వాసు విద్యార్థులకు ఆటలు, క్రమశిక్షణ నేర్పించాల్సింది పోయి స్టడీ అవర్స్‌కు ఆలస్యంగా వచ్చారని వాత లు వచ్చేలా చితకబాదడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కలెక్టర్ స్పందించి పీడీ వాసుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఫుడ్ పాయిజన్, పాముకాట్లు, ఇతర ఇష్యూలు జరుగుతున్నాయని ఆరోపించారు. గురుకుల సమస్యలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

డీఎస్ఎస్‌లో చెత్త 'సంక్షేమం'

- బీసీ సంక్షేమశాఖ ఫ్లోర్‌లో మెట్లపైనే ఫర్నిచర్
- ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయిన చెత్త
- ఉన్నతాధికారుల పర్యవేక్షణపై మండిపడుతున్న విజిటర్స్

హైదరాబాద్, జనవరి9 (నమస్తే తెలంగాణ): పేరుకు అది సంక్షేమ శాఖ కార్యాలయం.. కానీ ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోయిన చెత్త. శాఖకు సంబంధించిన కమిషనర్లు, ఉన్నతాధికారులు, చైర్మన్లు నిత్యం చూస్తూ కూడా ఏమీ పట్టనట్టు ఉంటారు. అధికారుల పర్యవేక్షణాలోపానికి మాసబ్‌ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్ నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నది. వివరాల్లోకి వెళ్తే.. డీఎస్ఎస్ భవన్‌లోని 6వ ఫ్లోర్‌లో బీసీసంక్షేమశాఖ కమిషనర్, బీసీ శాఖ పరిధిలోని పలు కార్పొరేషన్ల చైర్మన్లు, ఎండీతోపాటు సెక్షన్ ఆఫీసర్ల చాంబర్లు కూడా ఉన్నాయి. ఇటీవల బీసీ సంక్షేమశాఖకు చెందిన ఉన్నతాధికారులు, చైర్మన్లకు సంబంధించిన చాంబర్లను రీ మోడల్ చేశారు. సీలింగ్‌తోపాటు, హంగు ఆర్భాటాలు కల్పించారు. అక్కడి వరకు బాగానే ఉన్నా.. ఆయా గదుల నుంచి తొలగించిన ఫర్నిచర్‌ను, ఇతరత్రా సామగ్రిని మాత్రం మెట్లపైనే నిర్లక్ష్యంగా వదిలేశారు. శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులు, చైర్మన్లు చూస్తూ కూడా పట్టించుకోకపోవడం గమనార్హం. భవన్‌కు వచ్చిన విజిటర్స్ సంక్షేమశాఖ అధికారుల నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. లక్షలు పెట్టి చాంబర్లను శ్రద్ధగా తీర్చిదిద్దుకున్న అధికారులు, భవన్ పరిసరాలను శుభ్రంగా ఉంచకపోవడాన్ని తప్పుబడుతున్నారు.

డిగ్రీ ఫెయిల్.. డాక్టర్‌గా అవతారం

- ప్రైవేట్ దవాఖానల్లో వైద్య సేవలు
- నకిలీ సర్టిఫికెట్లు సృష్టించిన ఘనుడు

కామారెడ్డి, జనవరి 9: డిగ్రీ ఫెయిల్.. కానీ డాక్టర్‌గా అవతారమెత్తాడు. ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించి స్పెషలిస్టు వైద్యుడిగా చెలామణి అయ్యాడు. పోలీసులు కూపీ లాగడంతో నకిలీ డాక్టర్ బాగోతం బట్టబయలైంది. కామారెడ్డిలో చోటు చేసుకున్న ఈ కేసు వివరాలను ఏఎస్పీ చైతన్యారెడ్డి గురువారం వెల్లడించారు. మంచిర్యాల జిల్లా మం దమర్రి మండలం రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన ముల్కల రవీందర్ డిగ్రీ ఫెయిల్ అయ్యాడు. డబ్బు సంపాదించాలనే యావ తో ఆర్ఎంపీల వద్ద కొంతకాలం పని చేసి, ప్రాథమిక వైద్యసేవల గురించి తెలుసుకున్నాడు. ఆ తర్వాత ఎండీ జనరల్ మెడిసిన్ చదివినట్టు ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించాడు. వాటి తో కామారెడ్డి స్టార్ హాస్పిటల్, ఆరోగ్య దవాఖానతో పాటు లింగంపేట మండలం భీమరాజు దవాఖానలో పిల్లల వైద్యుడిగా చేరాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని షన్ముఖ దవాఖానలో పీడియాట్రిషియన్‌గా పని చేసేందుకు రూ.2 లక్షలు తీసుకున్నాడు. అనుమానం వచ్చిన కామారెడ్డి మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నకిలీ డాక్టర్ బండారం బయటపడింది. దీంతో రవీందర్‌రెడ్డిని గురువారం అరెస్టు చేసి, అతడి నుంచి ఫేక్ ఆధార్ కార్డు, నకిలీ సర్టిఫికెట్లు, ఫోన్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఏసీబీకి చిక్కిన ప్రిన్సిపాల్

- జీతాల బిల్లు కోసం రూ.2 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, అటెండర్‌పై కేసు నమోదు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మైనార్టీ గురుకుల పాఠశాలలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ప్రిన్సిపాల్, అటెండర్

ఇల్లెందు, జనవరి 9 : ఓ కాంట్రాక్టు ఉపాధ్యాయురాలు నుంచి లంచం తీసుకుంటున్న ప్రిన్సిపాల్ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మైనార్టీ గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. ఇల్లెందు మైనార్టీ గురుకుల పాఠశాలలో సంధ్యారాణి ఆగస్టు నుంచి కాంట్రాక్టు తెలుగు టీచర్‌గా పనిచేస్తున్నది. ఆమెకు సంబంధించి నాలుగు నెలల జీతాల బిల్లు చేయడానికి ఆ పాఠశాల ప్రిన్సిపాల్ భీమనపల్లి కృష్ణ రూ.10 వేలు డిమాండ్ చేశాడు. దీంతో మొదటగా రూ.2 వేలు ఇస్తానని ఒప్పుకున్న సంధ్యారాణి తర్వాత ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. వారి పథకం ప్రకారం గురువారం ఉదయం ప్రిన్సిపాల్ కృష్ణకు ఉపాధ్యాయురాలు రూ.2 వేలు లంచం ఇవ్వగా.. ఆ డబ్బులు అటెండర్ రామకృష్ణకు ఇవ్వాలని సూచించాడు. దీంతో అప్పటికే అక్కడ మాటు వేసిన ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రిన్సిపాల్ కృష్ణ, అటెండర్ రామకృష్ణపై కేసు నమోదు చేసినట్టు ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు.

ఆరు కార్పొరేషన్ల విలీనం?

- వ్యవసాయ అనుబంధ కార్పొరేషన్లపై నజర్
- ఆరింటినీ ఒకే కార్పొరేషన్‌గా చేసే యత్నం
- లేదా మూసివేత దిశగా ప్రభుత్వం అడుగులు
- మంత్రి తుమ్మల సంకేతాలు.. కసరత్తు షురూ!

హైదరాబాద్, జనవరి 9(నమస్తే తెలంగాణ): వ్యవసాయ శాఖలో ఉన్న కార్పొరేషన్ల వల్ల ఎలాంటి ఉపయోగం లేదని ప్రభుత్వం భావిస్తున్నదా? ఆ కార్పొరేషన్లను మూసివేసేందుకే సిద్ధమవుతున్నదా? లేదా ఆరింటినీ కలిపి ఒకే కార్పొరేషన్‌గా చేయాలని చూస్తున్నదా? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. అయితే వీటిని మూసివేయడమా లేక అన్నింటినీ ఒకే గొడుకు కిందికి తేవడమా? అనే అంశంపై చర్చిస్తున్నట్టుగా తెలిసింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు మొదలుపెట్టినట్టుగా సమాచారం. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్పొరేషన్లపై పదే పదే చేస్తున్న వ్యాఖ్యలు కూడా ఇందుకు బలం చేకుర్చుతున్నాయి. ఈ జాబితాలో ఆగ్రోస్, హాకా, హార్టికల్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడ్ కార్పొరేషన్, సీడ్ సర్టిఫికేషన్, గిడ్డంగుల కార్పొరేషన్ ఉన్నట్టుగా ప్రచారం జరుగుతున్నది.

ఆది నుంచి మంత్రి తుమ్మల అసంతృప్తి

వ్యవసాయ శాఖ అనుబంధ కార్పొరేషన్ల పనితీరుపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. కొన్ని కార్పొరేషన్లతో ప్రభుత్వానికి నయా పైసా లాభం లేదనే అభిప్రాయం ఆయనలో ఉన్నట్టు తెలిసింది. దీంతో ఆయన తొలి నుంచి వ్యవసాయ శాఖ పరిధిలో ఇన్ని కార్పొరేషన్లు అవసరమా అంటూ ప్రతి సమావేశంలోనూ బహిరంగంగానే ప్రశ్నిస్తూ వస్తున్నారు. ఇటీవల 4 రోజుల క్రితం జరిగిన సమావేశంలోనూ ఇదేఅంశాన్ని లేవనెత్తినట్టు తెలిసింది. ఒకే రకమైన పనిని వివిధ కార్పొరేషన్లు చేయడంపైనా ఆయన అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఏ కార్పొరేషన్ కూడా సరిగ్గా పని చేయడం లేదనీ ఆయన విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా ఆగ్రోస్, హాకా, సీడ్ కార్పొరేషన్, సీడ్ సర్టిఫికేషన్, గిడ్డంగుల కార్పొరేషన్‌పై అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. పనితీరు మార్చుకోవాలని ఆయా సంస్థలకు మంత్రి పలుమార్లు హెచ్చరించారని, అయినా సదరు సంస్థలు మారకపోవడంతో మంత్రి ఆగ్రహంగా ఉన్నట్టు తెలిసింది. ఈ సంస్థలు అవినీతికి అడ్డాలుగా మారుతున్నాయనే అభిప్రాయమూ ప్రభుత్వంలో ఉన్నట్టు తెలిసింది. దీంతోనే ఆయా సంస్థలను ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఆయా సంస్థల లాభనష్టాలను పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ వీటిని మూసివేస్తే వాటి పరిధిలో చేపట్టే పనులను ఏ కార్పొరేషన్లకు అప్పగించాలనే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు సమాచారం.

మూసివేతపై సందిగ్ధం

ఆ ఆరు కార్పొరేషన్లు ఒక్కోటి ఒక్కో చట్టం ప్రకారం ఏర్పడ్డాయి. దీనికి తోడు ఇప్పటికే వీటిలో కొన్నింటికి చైర్మన్లను కూడా నియమించారు. ఈ నేపథ్యంలో వీటి మూసివేత అంత సులువు కాదనే అభిప్రాయాలు అధికారుల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఏం చేద్దామనే అంశంపై ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. పనితీరు సరిగా లేని, ఉపయోగం లేని కార్పొరేషన్లు అన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొస్తే ఎలా ఉంటుందని కూడా ఆలోచిస్తున్నట్టు తెలిసింది. అన్ని కార్పొరేషన్లను కలిపి ఒకే ఒక అధికారిని నియమించాలని, అది కూడా సీనియర్ ఐఏఎస్‌కు బాధ్యతలు అప్పగించాలని యోచిస్తున్నట్టు సమాచారం.

అప్పుల బాధ తాళలేక పౌల్ట్రీ రైతు ఆత్మహత్య

యాదగిరి (ఫైల్)

నర్సాపూర్,జనవరి 9 : అప్పుల బాధ తాళలేక మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్‌లో పౌల్ట్రీ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. తుజాల్‌పూర్‌కు చెందిన గొట్టిముక్కల యాదగిరి(52) వ్యవసాయం చేస్తూ, పౌల్ట్రీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని నెలల క్రితం అప్పుచేసి పౌల్ట్రీ షెడ్డును నిర్మించాడు. సాగుచేస్తున్న భూమి తన తండ్రి పేరు మీద ఉండడం, అప్పులు ఎలా తీర్చాలో తోయక పౌల్ట్రీ షెడ్డులో బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


రుణమాఫీ చేయించాలని రైతులు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కోదండరెడ్డి

మాఫీ చేయకుంటే 'స్థానిక' పోటీ కష్టమే

- సగం మందికి రుణమాఫీ కాలే..
- ఇలాగైతే స్థానిక ఎన్నికల్లో పోటీ చేయలేం
- రైతు సంక్షేమ కమిషన్‌కు నిజామాబాద్ కాంగ్రెస్ నేతల మొర
- మొక్కుబడిగా కమిషన్ పర్యటన
- రైతులతో ముఖాముఖి రద్దు
- రుణమాఫీపై ప్రశ్నిస్తారనే భయంతోనే విముఖత

మోర్తాడ్, జనవరి 9: 'నిజామాబాద్ జిల్లాలో సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదు. ఇలాగైతే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేదు' అని కాంగ్రెస్ నేతలు రైతు సంక్షేమ కమిషన్ ఎదుట వాపోయారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలోని పసుపు పరిశోధనా కేంద్రాన్ని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గురువారం సందర్శించారు. స్టాళ్ల వద్దకు వచ్చిన కమిషన్ సభ్యులు పసుపు వంగడాలు, యంత్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులందరికీ రుణమాఫీ చేయాలని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి కాంగ్రెస్ పార్టీకి చెందిన రైతులు వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలో సగం కంటే ఎక్కువ మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందని చెప్పారు. ఈ ప్రాంతంలో పెద్ద రైతులు ఉన్నందున బ్యాంకుల్లో రూ.2 లక్షలకు పైగా రుణాలు తీసుకుంటారని, అటువంటి వారందరికీ రుణమాఫీ చేయించాలని, రుణమాఫీ చేయకపోతే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితిలో లేమని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కోదండరెడ్డి రుణమాఫీ చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, కొన్ని ఇబ్బందుల కారణంగా చేయలేకపోయినట్టు వివరించారు. రుణమాఫీ గురించి పార్టీకి చెందిన రైతులే అడగడంతో ముఖాముఖిలోనూ ఇవే ప్రశ్నలు ఎదురయ్యే అవకాశముందని భావించి రైతులతో భేటీ కాకుండానే వెనుదిరిగిపోయారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

రైతు భరోసా 15వేలు ఇవ్వాల్సిందే

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ ర్యాలీ


కొల్లాపూర్‌లో ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్ రూరల్, జనవరి 9 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు అందిస్తామని చెప్పిన హామీని అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టి, ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీరం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రైతుబంధు కింద కేసీఆర్ ఎకరాకు రూ.10 వేలు అందిస్తే.. రైతులకు బిచ్చం వేస్తున్నారా.. మేము అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ప్రగల్భాలు పలికి, కొర్రీలు పెడుతూ రూ.12 వేలు అందిస్తామని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. హామీలన్నీ అమలయ్యే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

హామీలు నెరవేర్చాలని కలెక్టరేట్ ముట్టడి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం నేతలు గురువారం నిజామాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఎమ్మెస్పీ గ్యారంటీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. రేవంత్ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. మూతబడిన నిజాం షుగర్స్‌ను పునరుద్ధరిస్తామన్న కాంగ్రెస్ సర్కారు.. ఏడాదైనా ప్రారంభించనే లేదని ఎద్దేవా చేశారు. అదే సమయంలో కలెక్టరేట్‌కు వచ్చిన రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని రైతు సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. –కంఠేశ్వర్

రైతులకు రుణమాఫీ కాలేదని..

డిప్యూటీ సీఎంకు బ్లాక్ కాంగ్రెస్ నేతల వినతి

కల్వకుర్తి, జనవరి 9 : వంద శాతం రుణమాఫీ చేశామని ఊకదంపుడు ప్రకటనలతో రైతులను అయోమయానికి గురిచేస్తున్న ముఖ్యమంత్రి, మంత్రుల ప్రకటనలు తప్పని నిరూపిస్తూ స్వయంగా అధికార పార్టీకి చెందిన బ్లాక్ కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ఆర్థిక శాఖ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రం ఇచ్చారు. వనపర్తి జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న భట్టి కల్వకుర్తికి రాగా బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతులకు రుణమాఫీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులు చెల్లించాలని విన్నవించారు. గ్రామాల్లో 50 శాతానికిపైగా రైతులకు రుణమాఫీ కాకపోవడంతో గ్రామాలలో ఉండే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల పరిస్థితి అడ్డకత్తెరలో పోకచెక్కలా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్రస్థాయిలో అవమానకరరీతిలో పరాజయం తప్పదనే భయంలో అధికార పార్టీ నాయకులు అల్లాడుతున్నారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందనే విషయం రైతులందరికీ అర్థమవుతోందని నాయకులు అంటున్నారు.

పత్తి కొనుగోలు చేయాలని చిట్యాలలో ఆందోళనకు దిగిన రైతులు

పత్తి కొనుగోలు చేయాలని రోడ్డెక్కిన రైతులు

చిట్యాల, జనవరి 9 : నల్లగొండ జిల్లా చిట్యాలలోని సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి కొనుగోళ్లను నిలిపేస్తున్నట్టు అధికారులు ప్రకటించడంతో ఆగ్రహించిన రైతులు రోడ్డెక్కారు. గురువారం పత్తి తీసుకువచ్చి రైతులు బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై ధర్నా చేశారు. వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ చేరుకుని ఆందోళన విరమింపజేసే క్రమంలో రైతులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. సీఐ నాగరాజు, ఎస్ఐ ధర్మా రైతులతో కలిసి సీసీఐ కొనుగోలు కేంద్రం వద్దకు చేరుకుని అధికారులతో చర్చలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణ, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి జానయ్య పాల్గొన్నారు. పత్తిని శుక్రవారం కొనుగోలు చేసేందుకు సీసీఐ అధికారులు ఒప్పుకోవడంతో పత్తి లోడ్లను మిల్లులోకి పంపించారు.